సాక్షి
నిజామాబాద్
శనివారం । 4 । నవంబర్ । 2023



యూత్ పవర్ చూపిస్తాం
హామీలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వానికి యూత్ పవర్ చూపిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.
- IIలో ▸



గౌరవంగా వ్యవహరించాలి
విద్యుత్ శాఖ ఉద్యోగులు వినియోగదారులతో గౌరవంగా వ్యవహరించాలని ఎస్ఈ రవీందర్ పేర్కొన్నారు.
- IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.9 /20.9
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్ పరిశీలన
సుభాష్‌నగర్ : జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. సాధారణ పరిశీలనలో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, భద్రపర్చి ఉన్న ఇతర ఎన్నికల సామగ్రి వివరాలతో కూడిన రికార్డులను తనిఖీచేశారు. అగ్నిమాపక సామగ్రి, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సుభాష్‌నగర్ : ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ధాన్యానికి మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించేందుకు వీలుగా జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్లను అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి కలెక్టర్ శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ క్వింటాలుకు రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జగదీశ్, పౌర సరఫరాల శాఖ ఏఎస్ఓ రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కేంద్రం పరిశీలన



సుభాష్‌నగర్ : రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు చిన్మయ్ పాటిల్ ప్రభాకర్ (ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్ అధికారి) శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. అంతకుముందు అబ్జర్వర్ చిన్మయ్ పాటిల్ పలు చెక్ పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరు పరిశీలించారు. అబ్జర్వర్ వెంట ఎంసీఎంసీ కమిటీ మెంబర్ సెక్రెటరీ ఎన్ పద్మశ్రీ, నోడల్ అధికారి పాపయ్య, ఈడీఎం కార్తీక్, లైజన్ అధికారి గంగాధర్ తదితరులు ఉన్నారు.





ఆర్మూర్‌లోని ఆలూర్ రోడ్‌లో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

టార్గెట్ కాంగ్రెస్!

రాష్ట్రానికి ఎట్లెట్ల ఆదాయం పెరుగుతుందో అట్లట్ల సంక్షేమ పథకాలను పెంచుకుంటూ పోతున్నామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఐకే రెడ్డిల విజ్ఞప్తి మేరకు మరికొంత మంది బీడీ కార్మికులకు కొత్తగా పింఛన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ ఊసెత్తని వైనం
- వ్యవసాయానికి మూడు గంటలు విద్యుత్ చాలన్నారు..
- రైతుల శ్రేయస్సు కోరి 24 గంటలు ఇస్తున్నాం..
- ఆదర్శంగా అంకాపూర్ రైతులు
- కొత్తగా మరికొంతమంది బీడీ కార్మికులకు పింఛన్లు
- ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

ఆర్మూర్ : సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీనే టార్గెట్ చేశారు. ఆర్మూర్ పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసిన సీఎం బీజేపీ ఊసెత్తకుండా తన ప్రసంగాన్ని ముగించారు. కేసీఆర్ మాట్లాడుతూ టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలు చెల్లించిన టాక్స్‌ను వృథా చేస్తున్నారని ఆరోపించడం తగదన్నారు. ఈ మొత్తాన్ని రైతుల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నామన్నారు. ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 24 గంటలు విద్యుత్ వేస్ట్.. మూడు గంటలు చాలనడాన్ని ప్రస్తావిస్తూ ప్రజల మాటే బీఆర్ఎస్ మాట కాబట్టి 24 గంటల విద్యుత్‌ను కొనసాగిస్తామన్నారు. కేసీఆర్ సభా స్థలికి చేరుకోగానే ఆయను చూడటానికి మహిళలంతా ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. ఆయనకు అనుకూలంగా నినాదాలు చేసారు. 18 నిముషాల పాటు కేసీఆర్ ప్రసంగం సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించారు. మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఐకే రెడ్డిల విజ్ఞప్తి మేరకు మరికొంత మంది బీడీ కార్మికులకు పింఛన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి ఎట్లెట్లా ఆదాయం పెరుగుతుందో అట్లట్లా పథకాలను పెంచుకుంటూ పోతున్నామన్నారు. కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు పింఛన్లను క్రమంగా పెంచుతున్నామన్నారు.

■ ఉదయం 11 గంటల నుంచే ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని ఆర్మూర్, నందిపేట, మాక్లూర్, ఆలూరు, డొంకేశ్వర్ మండలాల్లోని మారు మూల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలి వచ్చారు. కేసీఆర్ ప్రసంగాన్ని వినడం కోసం గంటల తరబడి ఓపికగా ఎదురు చూసారు. సుమారు 40 వేల మంది ప్రజలు వివిధ మార్గాల నుంచి సభా స్థలికి చేరుకోగా 10 వేల మంది వరకు సభా స్థలి బయట రోడ్లపై నిలిచిపోయారు. ఆయన సభా స్థలికి చేరుకొనే సమయం వరకు తెలంగాణ ధూంధాం కళాకారులు తమ ఆటపాటలతో ఉత్సాహం నింపారు.



సభలో ఆర్మూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డిని పరిచయం చేస్తున్న సీఎం కేసీఆర్

అంకాపూర్ అంటే ప్రాణం..

ముఖ్యమంత్రి కేసీఆర్ నోట మరోమారు అంకాపూర్ మాట పలికింది. అంకాపూర్ అంటే తనకు ప్రాణంతో సమానమన్నారు. ఇక్కడి రైతులు చైతన్యవంతులు, వీరిని ఆదర్శంగా తీసుకొని వందలాది గ్రామాల రైతులు ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. అంకాపూర్ వ్యవసాయం గురించి ప్రపంచంలో తనకంటే ఎక్కువ ప్రచారం చేసిన వారు లేరన్నారు.

ఫ్లెక్సీలపై కవిత ఫొటోపై చర్చ..
సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన కొన్ని ఫ్లెక్సీలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫొటో లేకపోవడంతో తప్పిదాన్ని గ్రహించిన నిర్వాహకులు.. వెంటనే ఆమె ఫొటోను అతికించారు. ఆర్మూర్ నియోజకవర్గం స్థానంలో నిజామాబాద్ అన్ని తప్పుగా ప్రింట్ కావడంతో వాటిని సవరించారు.

డ్యాన్స్‌లు చేసిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే..
ముఖ్యమంత్రి కేసీఆర్ సభాస్థలికి రావడం ఆలస్యం అవుతుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంలో భాగంగా తెలంగాణ ధూంధాం పాటలకు అనుగుణంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ విఠల్ రావు, ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్లు వేదికపై డ్యాన్సులు చేశారు. కాగా సభ ముగియగానే ప్రజల నుంచి వచ్చిన స్పందనపై పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ఆరా తీస్తూ కనిపించారు.

సభలో రాజ్యసభ సభ్యులు దామోదర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, డాక్టర్ మధుశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్
- ఆర్మూర్ పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఉదయం 11 గంటల నుంచే ప్రజలు వాహనాల్లో తరలివచ్చారు.
- మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ ధూంధాం కళాకారులు తమ ఆట, పాటలను ప్రారంభించారు.
- పార్టీ శ్రేణులు ముందుగా సూచించిన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి సుమారు గంటన్నర ఆలస్యంగా 3:39కి సీఎం సొంత చాపర్‌లో సభాస్థలికి చేరుకున్నారు.
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, దామోదర్ రావు ఆయనకు స్వాగతం పలికారు.
- సభాస్థలికి చేరుకోగానే బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రసంగం అనంతరం కేసీఆర్ 3:55 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి 4:13లకు ముగించారు.
- 4:15 నిముషాలకు సభా స్థలి నుంచి సీఎం చాపర్‌లో కోరుట్ల సభకు వెళ్లిపోయారు.

– ఆర్మూర్

రూ.వేల కోట్లతో అభివృద్ధి

ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో రూ. మూడు వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు.



సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు





సభలో పాల్గొన్న ప్రజలు

తొలిరోజు ఐదు నామినేషన్లు

- అర్బన్‌లో మూడు, బోధన్, ఆర్మూర్‌లో ఒక్కొక్కటి..
- రిటర్నింగ్ కార్యాలయాల వద్ద భద్రత

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఉన్న రిటర్నింగ్ కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రక్రియ కొనసాగింది. తొలిరోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. అర్బన్‌లో ముగ్గురు, బోధన్, ఆర్మూర్‌లో ఒక్కరు చొప్పున నామినేషన్ పత్రాలు సమర్పించారని, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ, బాల్కొండలో ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదన్నారు.

ఆరు నియోజకవర్గాల్లో..
జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో తొలిరోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నిజామాబాద్‌అర్బన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ తరఫున ఆయన భార్య, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌టీపీ తరఫున మిర్యాల్‌కల్ జయప్రకాశ్, అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మహ్మద్ మన్సూర్ అలీ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి మంద మకరంద్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు. అలాగే బోధన్‌లో షార్జీల్ ప ర్వేజ్ ఏఐఎంఐఎం తరఫున నామినేషన్ వేయగా రిటర్నింగ్ అధికారి రాజా గౌడ్ పత్రాలు స్వీకరించారు. ఆర్మూర్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా సుంకె శ్రీనివాస్ రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. నామినేషన్ల స్వీ కరణ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని ఆరు ని యోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయా ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పా టు చేశారు.



అర్బన్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి

నామినేషన్ల స్వీకరణలో తప్పిదాలు జరగొద్దు

సుభాష్‌నగర్ : నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ శుక్రవారం వెలువడిన నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీపీ కల్మేశ్వర్ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నగరపాలక సంస్థ నూతన భవనంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని, నగర పాలక సంస్థ పాత భవనంలో రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. రెండు నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. రిటర్నింగ్ అధికారులు మకరంద్, రాజేంద్రకుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఆర్‌వో కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం..
ఈనెల 10వ తేదీ వరకు స్వీకరణ ప్రక్రియ కోసం జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్‌వో కార్యాలయాల వద్ద ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో బందోబస్తు ఉంటుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సువిధ యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీఎంను ఓడించి చరిత్ర సృష్టిస్తారు

- కామారెడ్డి ప్రజలు చైతన్యశీలురు
- వేల కోట్లు ఖర్చు చేసినా కేసీఆర్‌కు ఓటమి తప్పదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఓడించి కామారెడ్డి ప్రజలు చరిత్ర సృష్టిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డిలో పార్టీ నియోజకవర్గ బూత్ విజయ్ అభియాన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కిషన్‌రెడ్డికి జాతీయ రహదారిపై పొందుర్తి వద్ద బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారినుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్‌రోడ్డు, ఇందిరాచౌక్ మీదుగా రాజారెడ్డి గార్డెన్ వరకు సాగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కామారెడ్డి ప్రజలు చైతన్యశీలురని, బీఆర్ఎస్ నేతలు ఎన్ని కోట్లు కుమ్మరించినా వారిని కొనలేరని పేర్కొన్నారు. కేసీఆర్‌ను గజ్వేల్ ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే ఆయన వారికి చేసిందేమీ లేదన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ తెలంగాణలో రోడ్ల గురించి గొప్పగా మాట్లాడారని, ఆ జాతీయ రహదారులకు పెద్ద ఎత్తున నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ల పేరుతో 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు.

కామారెడ్డికి ఒరిగిందేమీ లేదు..
తెలంగాణ వచ్చిన తర్వాత కామారెడ్డికి జరిగిన మేలు ఏమీ లేకపోగా, రైతులు తయారు చేసే బెల్లం మీద ఆంక్షలు పెట్టారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు ప్రజల మీద, ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదని, డబ్బు, అధికార దుర్వినియోగం, మజ్లిస్ పార్టీల మీదే నమ్మకం ఉందని విమర్శించారు. మాట తప్పితే తల నరుక్కుంటానన్న ముఖ్యమంత్రి వందలసార్లు మాట తప్పారన్నారు. ఆయన తల నరుక్కోవడం కాదని, బీఆర్ఎస్ పార్టీ తల నరికేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వాళ్లొస్తే పెనంమీంచి పొయ్యిలో పడ్డట్లే..
బీఆర్ఎస్ వాళ్లు బర్రెలు తింటే, కాంగ్రెస్ వాళ్లు ఏనుగులు తినే రకమని, వారికి అధికారం అప్పగిస్తే పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో 365 మంది విద్యార్థులను కాల్చిచంపిన చరిత్ర కాంగ్రెస్‌దని, మలిదశ ఉద్యమంలో 1,200 మందిని పొట్టన పెట్టుకున్నదీ కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. గ్యారంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల్ని వంచించిందన్నారు. ఇక్కడా అవే గ్యారంటీలతో వస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ డబ్బులిస్తున్నారని, వాళ్లు గెలిచినా గతంలో లాగే బీఆర్ఎస్ గూటికి చేరతారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్టేనన్న విషయాన్ని ప్రజలు మరచిపోవద్దన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావలసిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలో నీతివంతమైన పాలన సాగుతోందని, రాష్ట్రంలో బీసీ సీఎం నాయకత్వంలో నీతివంతమైన పాలన అందిస్తామని పేర్కొన్నారు. బీసీలు బీజేపీకి మద్దతుగా నిలవాలని కోరారు. 24 గంటలూ అందుబాటులో ఉండే బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డితో మేలు జరుగుతుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తే.. రాష్ట్రంలో ఏర్పడబోయే బీజేపీ ప్రభుత్వంలో ఆయనను మంత్రిగా నిలబెట్టే బాధ్యత తనదని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సమావేశంలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు మురళీధర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, నీలం రాజులు, చీకోటి ప్రవీణ్, కుంట లక్ష్మారెడ్డి, విపుల్ జైన్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు



మాట్లాడుతున్న కిషన్ రెడ్డి, పక్కన కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట రమణారెడ్డి

నా ఆస్తి కార్యకర్తలే..

కామారెడ్డి టౌన్: తన యావదాస్తి బీజేపీ కార్యకర్తలు, ప్రజలేనని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బూత్ విజయ్ అభియాన్‌లో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. బీజేపీ కార్యకర్తలు నోట్లు, బీరు, బిర్యానీలకు ఆశపడి వచ్చేవారు కాదన్నారు. తమకు ప్రతి గ్రామంలో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. బీఆర్ఎస్‌కు బీజేపీ సత్తా చూపాలనే శుభం ఫంక్షన్ హాల్ ముందు నుంచి ర్యాలీ తీశామన్నారు. కామారెడ్డిలో ధర్మానికి, నీతి, నిజాయితీకి పేరైన బీజేపీకి.. అవినీతి, అధర్మం, అక్రమాలకు మారుపేరైన బీఆర్ఎస్‌కు మధ్య యుద్ధం జరుగుతోందని, సీఎం కేసీఆర్‌ను ఓడించడం ఖాయమని పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

క్లుప్తంగా

తగ్గుతున్న నీటి మట్టం

బాల్కొండ: ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. కాకతీయకాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200, ఆవిరి రూపంలో 526, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులనీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1089.50(82.5 టీఎంసీలు)ల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ప్రారంభమైన అథ్లెటిక్ టోర్నీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజారాం స్టేడియంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇలియాస్ బాబర్ మెమోరియల్ ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకుడు సయ్యద్ ఖైసర్ మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడానికే స్వచ్ఛందంగా టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. అనంతరం విజేత జట్లకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. శనివారం 1600మీటర్ల రన్నింగ్ పోటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ లింగయ్య, రాంమోహన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నీరజారెడ్డి, అబ్దుల్ అజీజ్, షేక్ హుస్సేన్, లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు జహీరొద్దీన్, ఖాజా మోహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



బిచ్కుంద(జుక్కల్): వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, రబీ పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఏడీఏ అనిల్ కుమార్ సూచించారు. శుక్రవారం బిచ్కుందలో అన్ని మండలాల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. మందులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని, దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఏవోలను ఆదేశించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండలంలోని శెట్లూర్, హజ్గుల్ గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ అధికారులు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి గిట్టుబాటు ధర పొందాలని ఏడీఏ అన్నారు. ఏవో పోచయ్య, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

యూత్ పవర్ చూపిస్తాం

- ప్రత్యేక తెలంగాణలో నిరుద్యోగుల పాత్ర ఎంతో కీలకం
- ఉద్యోగాలు లేక అల్లాడుతున్న యువత
- పూర్తిగా గాడితప్పిన విద్యావ్యవస్థ
- 'సాక్షి పీపుల్స్ మేనిఫెస్టో'లో విద్యార్థి సంఘాల నాయకులు



సాక్షి ఆధ్వర్యంలో జరిగిన చర్చా వేదికలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు



నిజామాబాద్‌అర్బన్/నిజామాబాద్‌సిటీ: కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణలో యువత పాత్ర ఎంతో కీలకమైందని పలు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సాక్షి టౌన్ ఆఫీస్‌లో శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులతో 'సాక్షి' ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టోపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో యూత్ పవర్ ఏంటో చూపిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనకు ఎంతో మంది యువత ప్రాణత్యాగాలు చేశారని, అంతేకాకుండా తెలంగాణ సిద్ధించాక ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో ఎంతో మంది అసువులు బాసినట్లు తెలిపారు. కానీ రాష్ట్రం సిద్ధించాక నిరుద్యోగ యువత పరిస్థితి దుర్భలంగా మారిందని, దీనికి ప్రధాన కారణం ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలవ్వడమేనని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రస్తుత విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని నిధులు, నియామకాలు లేక అస్తవ్యస్తంగా మారిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిజామాబాద్ జిల్లాలో విద్యావ్యవస్థ వెనుకబడి ఉండడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

వైఎస్ రీయింబర్స్‌మెంట్ ఇస్తే..



విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్యను అందించి వారి అభివృద్ధిలో దోహదపడేందుకు నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులందరికి పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందించారు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయడం లేదు. జిల్లాలో ఉన్న టీయూ నిత్యం వివాదాలకు కేంద్రంగా మారింది.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యోగాలు భర్తీ కావడం లేదు



ఉద్యోగాలను భర్తీ చేయలేక రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత మాటలతో నిరుద్యోగులను మోసం చేస్తోంది. తొమ్మిదన్నర ఏళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీచేయక ఎంతో మంది నిరుద్యోగులను ఇబ్బందుల్లోకి నెట్టివేసింది. నోటిఫికేషన్ల జారీ తప్ప ఉద్యోగాలు భర్తీ కావడం లేదు.

– జైత్రం రాథోడ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత



ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి మాత్రమే డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుతం నోటిఫికేషన్లే తప్ప ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– అనిల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

ఇన్‌చార్జీల పాలనతో అస్తవ్యస్తం..



జిల్లాలో 72 సంక్షేమ వసతి గృహాలు ఉంటే ఇందులో 22 మంది మాత్రమే రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. మిగతా వాటిల్లో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. దీంతో హాస్టల్ నిర్వహణ నిర్లక్ష్యానికి గురవుతోంది. రాష్ట్ర నిరక్షరాస్యత రేటు జాతీయ సగటు 35.73 శాతం కంటే ఎక్కువ. ప్రభుత్వంలో ఇంకా 1.91 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.

– జ్వాల, ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

నిరుద్యోగులను మోసం చేసింది



గ్రూప్–1 పరీక్ష పలుమార్లు వాయిదా పడడం నిరుద్యోగులను ఎంతో ఇబ్బందులకు గురిచేసింది. గ్రూప్–2 , 3 పరీక్షల నిర్వహణ ఇంకా జరగలేదు. గ్రూప్–4 ఫలితాలు ఇంకా రాలేదు. ఎన్నికల ముందు నోటిఫికేషన్లు జారీ చేసి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. పేపర్ లీకేజీలు అరికట్టలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదు.

– వేణురాజ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమకారులను అణచివేస్తున్నారు



జిల్లాలో ఉద్యమకారులను అణచివేస్తున్నారు. ఏదైన విద్యారంగ సమస్యపై నిరసన చేస్తుంటే ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారు. సమస్యలను చెప్పుకునే హక్కు కూడా లేకుండా పోయింది. విద్యార్థుల ప్రాణాలతో తెచ్చుకున్న తెలంగాణలో పోలీసులతో ఉద్యమాన్ని అణచివేస్తున్నారు. టీఎస్‌పీఎస్‌ని వెంటనే రద్దుచేయాలి.

– కళ్యాణ్, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు

ఇంటికో ఉద్యోగం ఏమైంది..



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. కనీస సౌకర్యాలు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన పర్యవేక్షణ లేక విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. ఇంటికో ఉద్యోగం ఏమైంది. ప్రస్తుతం నోటిఫికేషన్లు ఇచ్చారే తప్ప పోస్టుల భర్తీ కావడం లేదు.

– రఘురాం, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి

దొంగ హామీలతో మోసం



ప్రత్యేక తెలంగాణ సాధించాక సీఎం కేసీఆర్ దొంగ హామీలతో అందరినీ మోసం చేశారు. తెలంగాణ ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తాయన్న నిరుద్యోగుల ఆశ కలగానే మారిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్‌సీ తెలంగాణ సేల్స్ సర్వీస్ కమిషన్‌గా మారిపోయింది.

– లాల్‌సింగ్, టీయూవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు

ప్రైవేట్ ఫీజులు కట్టలేక..



22 లక్షల మందికి పైగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో వివిధ రిక్రూట్‌మెంట్ పరీక్షల కోసం ఉద్యోగం సాధించాలనే ఆశతో రిజిస్టర్ చేసుకున్నారు. మహిళల్లో నిరుద్యోగం రేటు 2017–18లో 25.7%తో పోలిస్తే 2018–19లో 31.5%కి పెరిగింది. విద్యార్థులు ప్రైవేటు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

– కిరణ్, ఏఐపీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు

ఉన్నత విద్యకు ఇక్కట్లే..



జిల్లాలో ఉన్నత విద్య అందుబాటులో లేదు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, వెటర్నరీ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరం. మహిళా డిగ్రీ కళాశాల అందుబాటులో లేదు. విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవు.

– అనిల్, టీజీవీపీ నగర అధ్యక్షుడు

బీజేపీ జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు

సుభాష్‌నగర్: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా కమిటీలో మరో ఇద్దరికి చోటు కల్పించారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య వారిని నియమించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మేక సంతోష్, జిల్లా కార్యదర్శిగా యెండల సుధాకర్‌కు అవకాశం కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో పార్టీ బలోపేతం, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపడుతామని, పార్టీని సంస్థాగతంగా పటిష్టపర్చి అన్నివర్గాల్లో మరింత విస్తరించడానికి పాటుపడుతామని తెలిపారు.

పారదర్శకతతో విధులు నిర్వర్తించాలి



బోధన్‌రూరల్: విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వినియోగదారులతో గౌరవంగా వ్యవహరించాలని, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని బాబాగార్డెన్‌లో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో డివిజన్ స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంస్థ అభివృద్ధి కోసం బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఈలు వెంకటరమణ, రాజేశ్వర్, ఏడీఈలు బెనర్జీ, రవి కుమార్, లక్ష్మణ్, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

5న అండర్-13 చెస్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న అండర్–13 బాలబాలికల విభాగంలో చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఆకుల రమేశ్ శుక్రవారం తెలిపారు. నగరంలోని వీక్లీమార్కెట్‌లో ఉన్న సన్‌ఫ్లవర్‌స్కూల్‌లో ఉదయం 9 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. 01.01.2010 తర్వాతా పుట్టిన క్రీడాకారులు అర్హులన్నారు. బోనాఫైడ్, చెస్‌బోర్డు తీసుకొని పోటీలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9440007004 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పునర్విభజనతో మారిన 'బాల్కొండ'

- 2009కి ముందు ఐదు మండలాలు, 90 జీపీలు
- పునర్విభజన తరువాత తగ్గిన జీపీలు
- ప్రస్తుతం రెండు జిల్లాలకు విస్తరించిన బాల్కొండ నియోజకవర్గం



జంగ్ తెలంగాణ

మోర్తాడ్: కొత్త మండలాలు, జిల్లాల ఆవిర్భావంతో బాల్కొండ నియోజకవర్గ స్వరూపం మారిపోయింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాలది ఒకదారైతే బాల్కొండ నియోజకవర్గం మరో రూటులో ఉంది. పునర్విభజనతో నియోజకవర్గం స్వరూపం కొత్త రూపాన్ని సంతరించుకుంది. జిల్లాలోని ఎనిమిది మండలాలతో పాటు రాజన్న సిరిసిల్లా జిల్లాలోని 11 జీపీలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. అంటే బాల్కొండ నియోజకవర్గం రెండు జిల్లాలకు విస్తరించిందని స్పష్టమవుతోంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన విషయం విధితమే. అప్పటి వరకు ఈ నియోజకవర్గంలో బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, నందిపేట్ మండలాల్లోని కొన్ని గ్రామాలు కొనసాగాయి. అప్పట్లో మోర్తాడ్ మండలంలోని మూడు, కమ్మర్‌పల్లి మండలంలోని నాలుగు గ్రామాలు ఆర్మూర్ నియోజకవర్గంలో కొనసాగాయి. 2009లో పునర్విభజన అనంతరం బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, వేల్పూర్ మండలాలతో కొత్త రూపం తీసుకొచ్చారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తరువాత చోటు చేసుకున్న పరిణామాలతో మండలాల సంఖ్య పెరిగింది. కొత్త పంచాయతీల ఏర్పాటుతో నియోజకవర్గంలో మొత్తం 113 జీపీలు కొనసాగుతున్నాయి. కమ్మర్‌పల్లి మండలంలో కొనసాగిన మానాల, ఆ పంచాయతీ పరిధిలోని గిరిజన తండాలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడి రుద్రంగి మండలంలో విలీనమై రాజన్న సిరిసిల్లా జిల్లాలో చేరాయి. ఇక్కడ ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే రెండు జిల్లాల కలెక్టరేట్‌లలో నిర్వహించే వివిధ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుంది. మానాలకు మండల పరిషత్, జిల్లా పరిషత్ వేరైనా బాల్కొండ నియోజకవర్గంలోనే కొనసాగుతుండడం గమనార్హం.





ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో నృత్యం చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వర్సిటీ ప్రిన్సిపాల్ ఆరతి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని వివిధ అనుబంధ కళాశాల విద్యార్థులతో శుక్రవారం ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. క్యాంపస్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో తెయూ పరిధిలోని 11 కళాశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారితో తెయూ ఇంటర్ యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన 15 మంది క్రీడాకారులు ఈ నెల 9 నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పురుషుల పోటీలకు సౌత్‌జోన్ నుంచి పాల్గొంటారని వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ జి.బాలకిషన్ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, చీఫ్‌వార్డెన్ మహేందర్, ప్రభుత్వ గిరిరాజ్ కాలేజ్ పీడీ బి.బాలమణి, పీడీ అనిల్‌కుమార్, రాజేశ్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గండి అర్బన్ పార్కు సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 35 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నగదు పట్టివేత



నిజాంసాగర్: నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం ఓ కారులో రూ. 50,100 నగదును పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. జహీరాబాద్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న కారులో ఈ నగదు లభించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



చక్రవర్తి (ఫైల్)

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో దసరా పండుగ రోజు రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ డాకూరి చక్రవర్తి(43) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన డాకూరి చక్రవర్తి, తన కొడుకు సుమిత్‌తో కలిసి మెట్‌పల్లి రోడ్‌లోని తన టింబర్ డిపోకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో మసీద్ వద్ద కమ్మర్‌పల్లికి చెందిన కరిపె మారుతి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో చక్రవర్తి, సుమిత్‌లకు తీవ్రగాయాలు కాగా, మారుతికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. చక్రవర్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అస్వస్థత

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం చేసిన పలువురు విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లారు. గంట తర్వాత కొందరికి కడుపునొప్పి, మరికొందరు వాంతులు చేసుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను వారి ఇంటికి పంపించారు. మహమ్మద్‌నగర్, బూర్గుల్, గున్కుల్, నర్వ గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్య చికిత్సలు చేయించినట్లు సమాచారం.

411 చీరలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న చీరలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని టేక్రియాల్ చౌరస్తాలో రూరల్ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా ఓ కారులో 411 చీరలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ. 6,16,500 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు చూపకపోవడంతో తదుపరి చర్య నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ ప్రకాశ్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.



సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవ్యస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● **తగినంత నిద్ర**

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

● **పరిశుభ్రతను పాటించడం**

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.





లైఫ్@360

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్ళలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్టరాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్



● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1996)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని



● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నాని **మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...



● తరుణ్ భాస్కర్


'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణు గోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..



● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరికట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.